# ఏకోదరులు

"యం.యస్.చలం"

తన తమ్ముడు సుబ్బరామయ్య చూసి చూసి మరదలి కొడుకుని పెంచుకోబోతున్నాడని తెలిసినప్పుడు రామసుబ్బయ్యకు చాలా ఆగ్రహం కలిగింది.

ఈవిధంగా జరుగుతుందని తను ఒక్కనాటికీ అనుకోలేదు. తనేకాదు యెవ్వరుమాత్రం అనుకోగలరు? ఒక వున్నతకులానికి చెందిన సంపన్న గృహస్థుని కొడుకు యిలాటిపని చేస్తాడని ఎలా అనుకోవటం? పులికడుపున మేకపిల్ల పుట్టటమనేది అసంభవమైన విషయంకదా?

ఈవిషయంలో వాడిభార్య బలవంతం నూటికి నూరుపాళ్లూ వున్నదనేవిషయం తనకు తెలుసు. కాని వాడుమాత్రం అడదానికి దాసుడై పొయ్యేంత దుర్బలుడని తానెలా అనుకొనేది. ఆవిడకు పట్టుదల వుంటంలో ఆశ్చర్యంలేదు. ఏ ఆడదైనా తనకు సంతతి లేనప్పుడు తన ఆస్థిని తన చెల్లెలి సంతతికి చెందటానికి ప్రయత్నించడంలో విశేషంలేదు. వీడి తెలివి యేమైపోయిందా అనే!

తన అన్నకు అయిదుగురు బిడ్డలు వున్నారనే విషయం వాడికి తెలియనిదా? వాళ్ళలో ఏ ఒక్కణ్ణి దత్తతచేసుకుంటానంటే తను కాదనేవాడు? వాడు కేవలం తన మరదలి కొడుకుని దత్తత చేసుకోవటమంటే — భార్యకు లొంగిపోయేకాదు, తన అన్నకు చేసిన పరాభవం యెంతైనావుంది. వాడి మరదలి కొడుకు తన పిల్లలకంటే కొంచెం అందంగానే వుండవచ్చు. కాని ఒక్క సౌందర్యంలోనే ప్రేమనేది యిమిడివుంటే ఎందరు దంపతులు విడాకులిచ్చుకోవలసివుంటుందో —

తరువాత రామసుబ్బయ్య నోటివెంట కొన్ని అశ్రావ్యమైన మాటలుకూడా దొర్లిపోయాయి. ఆ తిట్లు ఎంత అసహ్యంగా వున్నవంటే - కడకు కడజాతివాడుకూడా తన సోదరునిపట్ల యీవిధమైన వాక్యాలను వుచ్చరించనందుకు గర్విస్తాడు. అసలు యెదుటివాణ్ణి దూషించటం అనే విషయానికి మానవుడు సంకల్పించినప్పుడు దూషణపొందేవాడికంటే దూషించేవాడు ఒక మెట్టు క్రిందికి దిగజారవలసి వుంటుంది. ఈ విషయాన్ని రామసుబ్బయ్య యదార్థంగా రుజువుచేయగలిగాడు.

అక్కడితో అతని కోపం శాంతించివుంటే బాగుండేది. ఈ దూషణతోపాటు అశీర్వాదాన్ని కూడా ఉపయోగించాడు. దేవుడేగనక వుండి, సృష్టి సత్యంమీదనే ఆధారపడి నడుస్తూంటే వాడు చేసిన యీ పనికి ఒకనాటికి ప్రాయశ్చిత్తం జరక్కపోదు. అంతవరకు వచ్చాకగాని అతడికి శాంతి కలగలేదు. మనసులోవున్న బరువంతా ఒక్కసారిగ తగ్గిపోయినట్లు శ్వాసవిడిచి పైనీది వుత్తరీయము సవరించుక వెళ్ళిపోయాడు.

ఈ కారణంగా అన్నదమ్ములమధ్య మాటామంతి నిలచిపోయినమాట వాస్తవమే. కాని దత్తతనాడు అన్నను పిలువనికారణంగా అతడు తమ్మునికి దూరంగా వుండవలసి వచ్చినదని పుట్టిన కింవదంతి మాత్రం నిజానికి శుద్ధాబద్ధం. ఈ వదంతి కేవలం అన్నగారు కల్పించిందనేవిషయం ఏకొంచం సూక్ష్మదృష్టితో పరికించినా బోధపడుతుంది.

దత్తతరోజున అన్నను పిలవటానికి తమ్ముడు సిగ్గుపడలేదని నేననను. ఆ విషయం వచ్చిన బంధువులతోనే అన్నాడు సుబ్బరామయ్య. నా అన్నను పిలవడానికి నాకే భయంగావుందని.

అన్నాడేగాని అతడు పిలవటం మానలేదు. ఒకసారి కాకుండా ముమ్మారు ప్రాధేయపడ్డాడు. అక్కడికీ తనఅన్న పెడముఖం పెట్టటంవల్ల వదినను కూడా బ్రతిమలాడాడు. అయితే ఆవిడ ముక్తసరిగా చెప్పిన మాటేమిటంటే— నాదేముంది, వారు సరేనంటే నేను కాదన్నానా? నేను కాదంటే మాత్రం ఆయన అడదానిమాటమీద నిలచిపోతే

వారా! ఈ మాటతో తనమరది తప్పిదాన్ని తను గూఢంగా దెప్పగలిగాననే తృప్తిపొందిందావిడ. ఈ స్థితి తెలిసినవాళ్లెవ్వరూకూడా సుబ్బరామయ్య నెపం తప్పించుకోవాలనే కారణంతో అన్నను పిలిచాలేగాని—అనడానికి సాహసించరు.

ఇక వీరి ద్వేషాలు ఎంతవరకు పెచ్చు పెరిగాయంటే - ద్వేషించటంతప్పితే యింకోపని అంటూ వీరికిలేదా అనేవరకూ వచ్చింది.

ఒకనాడు సుబ్బరామయ్య దత్త పుత్రునితో రామసుబ్బయ్య కొడుకు ఆటలాడుతున్నాడు. ఆ దృశ్యం కంటబడిన రామసుబ్బయ్య, కొడుకు వీపుమీద రెండు అంటించి చదువూ సంధ్యా లేకుండా అడ్డగాడిదలా ఆటలేమిటిరా వెధవా! అని బరబర లాక్కుపోయాడు. పాపం ఆ యేళ్లేళ్ల పిల్లవాడు బిక్కమొఖంవేసి తండ్రివెనక వెళ్ళిపోయాడు. మరి వాడికేం తెలుసు, తన తండ్రికి విరోధులైనవాళ్లు తనకూ విరోధులేనని.

అయితే యీ దృశ్యం సుబ్బరామయ్య కంటపడకపోలేదు. అతడు గొడ్లచావిట్లో కూర్చొని కిక్కురుమనకుండా చూస్తూవూరుకున్నాడు.

మరోకనాడు రామసుబ్బయ్యగారి దాసీది సుబ్బరామయ్య భార్యతో యిలాఅంది:

ఏదైనా విరోధంవుంటే మీమీద వుండాలిగాని పసికందు అయనేం చేశాడమ్మా! ఆటపిల్లడుగనక ఏదో పిల్లలతో ఆడుకుందామని యింటికి వస్తాడు. అంతమాత్రాన ఆయనకేసి ర్రేళ్లు విరవటం ఏమిపాపం!— యీ విషయం సుబ్బరామయ్య భార్యకు చాల కష్టమనిపించింది. అయినా ఆవిడ మాట్లాడలేదు.

ఈవిధంగా వాళ్లు కుక్కిన పేనులులా వూరుకోవటంతో అన్నగారి కుటుంబం మరింత రెచ్చిపోయింది.

ఒకనాడు అన్నకొడుకు మిఠాయి చేతపుచ్చుకొని యింటికి వెళ్ళేసరికి, వాడితల్లి చూసి రెక్కపట్టుకొని తండ్రిదగ్గరకు యీడ్చుకుపోయి యిలా అంకుకుంది:

"వీడికి మిఠాయి యిచ్చేంత ప్రేమ ఎక్కడ వుందో తెలియకుండావుంది. దీనిని ఏ కుక్కకో వేస్తేగాని అసలు సంగతి బోధపడదు" అంటూ వాడిచేతిలోనుంచి లాక్కుని బయటకు విసిరివేసింది. యీ కేకలన్నీ తమ్ముడి భార్యకు వినిపించటంతో సంగతంతా ఆమె కిటికీనుంచి గ్రహించనే గ్రహించింది. అయినా ఆవిడ పల్లెత్తి పలకలేదు.

ఇలాంటి ఘట్టాలు చాలా జరిగాయి. అవి విన్నంతమాత్రాన ఇంతకంటే కొత్త విషయాలేవీ మనకు తెలియబోవుగనుక పోనీండి.

ఇంతటి ప్రబల విరోధులు మళ్ళీ ఒకే కుటుంబీకులలా కలిసి తిరిగారంటే ఆశ్చపడనక్కర్లేదు. దానికి అనుకూలమైన పరిస్థితి ఒకటి యేర్పడింది.


## మదనకామేశ్వర లేహ్యము




బలవర్థకమయినది. మేహము నిక్కాక, నిస్సత్తువ, శుక్లనష్టము, అతిమూత్రము, మొదలగు వాటిని హరించి, మిక్కిలి బలమును, వీర్యవృద్ధిని, భోగశక్తిని కలిగించుటలో అప్రతిహతమయినది.

2 డబ్బీలు చాలును.

20 తులముల డబ్బీ రు. 2-0-0

## రోజాపుష్ప లేహ్యము

మధురమయినది. మలబద్ధకమును ఖండించుటలో అమోఘమైనది. అజీర్ణము, గర్భవాయువు, మూలవ్యాధి, మొదలగు వాటిని హరించి కొలవిరేచనము చక్కగా కలిగించును.

15 తు॥ డబ్బీ రు. 1-0-0 వి. పి. చార్జి ప్రత్యేకము.

అన్ని ఔషధముల క్యాటలాగు ఉచితం.

పి. సి. ఎ. అండు కంపెనీ,

ఆయుర్వేదసమాజం-పెరిదేపి, నెల్లూరుజిల్లా.

దత్తపుత్రుడు తలవనితలంపుగా జ్వరానికి గురికాబడి యీలోకాన్ని విడిచిపెట్టాడు. వాడి మరణం ఆ పెంచిన దంపతులకు చాలా విషాదాన్ని కలిగించింది. దుఃఖాన్ని మానవుడు ఎల్లకాలం సహించలేడని దానికి తెలుసు. కొద్దిరోజులు వుండి మర్యాదగానే దానిదారిని అది తప్పుకుంటుంది. వారి విచారం వుపశమనం అయ్యాక సుబ్బరామయ్య భార్యతో అన్నాడు: "పోయినవాడు ఎలానూ పోయాడు. ఆ రెండోవాణ్ణి యిస్తానంటే వాణ్ణి అయినా పెంచుకుందాం."

ఈ విషయాన్ని అతని భార్య ససేమిరా కొట్టివేసింది. ఒకణ్ణి తెచ్చుకొని వుద్ధరించాంగనక రెండోవాణ్ణి వుద్ధరిస్తామా! యింతకూ పిల్లలయోగం లేనివాంళ్లకు పెంచుకున్నా దక్కరు" అంది.

ఈ విషయంమీద అతనికి నమ్మకం లేకపోయినా భార్యమాటను కొట్టివేయలేకపోయాడు. తత్ఫలితంగా అతనికి కలిగిన ఆలోచన యేమిటంటే యిప్పుడైనా తన అన్నకొడుకుని చేరదీయటంవల్ల పూర్వ వైరం సర్దుబాటవుతుంది. దానితో మళ్ళీ యీ ప్రపంచంలో వాళ్ళిద్దరూ అన్నదమ్ములుగా మెలగవచ్చు. ఈ ఆలోచన భార్యకు నివేదించటంతో ఆవిడకూడా అంగీకరించింది.

* * *

తలవనితలంపుగా తన తమ్ముడు తన గడప త్రొక్కటంతో రామసుబ్బయ్యకు ఆశ్చర్యం వెయ్యకపోలేదు. అయినా అతడు బింకంగానే, మాట్లాడకుండా పెడముఖం పెట్టుకున్నాడు. అవుసరం తనదేగనుక సుబ్బరామయ్యే పలకరించాడు.

"అయిపోయిందేదో అయిపోయిందన్నయ్యా- మన గోపాలాన్ని నేను పెంచుకుంటాను."

ఈమాటతో అన్నముఖంలో కోపం ఆవేశించింది. "ఇదివరకు పనికిరాని గోపాలం యిప్పుడు యెలా పనికివస్తాడో తెలియకుండావుంది. నాపిల్లలను పెంచుకోగల తాహతు నాకు లేకపో


## వెప్రిన్

దెబ్బలు, కురుపులు, తామర, ఎక్జిమా, గజ్జి, సుఖవ్యాధులవలన కలిగిన పుండ్లు, తేలుకుట్టు, మూలశంఖ, కాల్పులు మొదలైనవాటిని అద్భుతంగా నివారణచేస్తుంది. కొత్తచర్మం త్వరగా వచ్చేటందుకు సహాయపడుతుంది. ప్రతీయింటా తప్పనిసరిగా డాక్టరులా వుండితీరాల్సిన ఔషధం.

$\frac{1}{4}$ ఔ. సీసా అణాలు 8. $\frac{1}{2}$ ఔ. సీసా అణాలు 14.

## హెతెరిన

అతిసారానికి, జిగట, రక్త విరోచనాలకి
అద్భుతమైన ఔషధం.
అతిసారం, జిగట, రక్త విరోచనాలు, వాంతులు, జబ్బువల్ల వచ్చిన జ్వరం వీటిని తగ్గించును.
అసాధ్యమైన జబ్బులన్నీ ఈ మందుకి
సాధ్యమౌతాయి.
6 మాత్రలు గల పేకెట్ 4 అణాలు.

## క్యాప్సినాల్

దగ్గు, రొంపల్ని అశ్రద్ధగా చూడకండి.
ఎందుకంటే ఊపిరతిత్తులలో రకరకాల వ్యాధుల్ని తీసుకొస్తుంది. అలా రాకుండా 'కాప్సినాల్' సహాయపడుతుంది.
దగ్గులు, రొంపలు, ఇన్ఫ్లుయన్జా, మొదలైన వ్యాధుల్ని నివారణచేస్తుంది.
6 మాత్రలు గల పేకెట్టు 4 అణాలు.
అన్నిషాపులలోనూ దొరకును.

The Lustre Manufacturing Co.,
Bangalore City.

లేదు. ఏ దౌర్భాగ్యుడి చేతిలోనో పెట్టవలసిన ఖర్మ కాలిపోలేదు.''

ఈమాటల్లో యెంత యదార్థంవుందో మనకు తెలియనిదికాదు.

సుబ్బరామయ్య మాత్రం అన్నకు శాంతంగానే నచ్చచెప్పాడు.

''అసలు విషయం నీకు తెలిసివుంటే నీకింత కోపం రాదన్నయ్యా! అది యింతవరకూ నీకు చెప్పకపోవటమే యీ కలతలకు కారణం.

శరగోపాలాచార్యులు ఎటువంటి దైవజ్ఞుడో నీకు తెలియనిదికాదు. ఒకనాటి సాయింత్రం వారికి హస్తాన్నిచ్చాను. వారు నాకు సంతానప్రాప్తిలేదనీ, పైగా నేను పెంచుకునే తొలిబిడ్డకూడా నాకు దక్కడనీ, ఆపై వాడుమాత్రమే నాఆస్థికి వారసుడౌతాడని, చెప్పారు.''

ఈమాటలతో అన్నగారిముఖం ఒక్కసారిగ వికసించింది. ''అదా అసలు విషయం! ఈ మాట ఒక్కనాడైనా, నాతో చెప్పకపోతివేమిరా!''

తమ్ముడు తలవంచుకున్నాడు. అతడు బహుశా ఒక్క అబద్ధంలో ఎంతశక్తి యిమిడి వుంటుందనే విషయమై యోచిస్తూవుండీవుంటాడు.

మర్నాటినుంచీ గోపాలం, తన పినతండ్రిని ''నాన్నా'' అనీ, పినతల్లిని ''అమ్మా'' అనీ పిలవటం నేర్చుకున్నాడు. ఇప్పుడు మళ్ళీ అన్నదమ్ముల మధ్య పొడసూపిన గాఢమైన బంధుప్రేమకు వూరువూరంతా ఆశ్చర్యపోతున్నారు. ఏమైనా లోకానికి యిలాంటి విషయాలు క్రొత్తకాదుగదా?

క్రొత్తరకాలు! క్రొత్తపోకడ



స్వచ్ఛమైన బంగారు - కావలసినప్పుడు
సొమ్ము చేసుకొనవచ్చును.

ఈ నగలు బంగారు గిల్టువేసినవికావు. లోపల లోహపు కడ్డీమీద బంగారు రేకు తొడగబడియుంది. కొద్దిఖరీదుకే ఎక్కువ నగలొస్తాయి.

మా కొతాదారులందరు మా టి. సి. యన్. గోల్డన్ మెటల్ నగలు కొన్నిసంవత్సరాలయినతరువాత కాంతి తగ్గుచున్నవి; అట్లులేకుండా చేయవలసినదని వ్రాసిన లేఖలకు మేము యీ జీవితకాల గ్యారంటీ రకాలను ప్రచారంలోకి పెట్టుతున్నాము.

ఉంగరము ఒకటికి రు. 10-0-0, వి. పి చార్జీ 0-10-0.




పెద్దసైజు గాజులు 2 అం. పైబడినవి జత 1-కి రూ. 20-0-0
మధ్యమసైజు గాజులు $1\frac{3}{4}$ అం. నుండి 2 అం. లోపల జత 1-కి రూ. 15-0-0
బేబీ సైజు గాజులు $1\frac{3}{4}$ అం. లోపల జత 1-కి రూ. 10-0-0
వి. పి. చార్జీలు 0-10-0.

టి. సి. నాగలింగప్ప అండ్ కో.,

280, వాల్‌టాక్సురోడ్, పి. టి., మద్రాసు.

ఏజంటు :—శ్రీ కె. యస్. తిమ్మప్ప శెట్టిగారు, గోపువారి బిల్డింగ్సు, బెజవాడ.